క్లుప్తంగా

మనబడి నాడు-నేడు పనుల పరిశీలన



నిర్మాణాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ వెంకటరావు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ ఎం.వెంకటరావు కలిసి మంగళవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేయించి, త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనును ఆదేశించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన



ఇంగ్లిష్ ఆవశ్యకతను వివరిస్తున్న సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ వ్యవస్థాపకులు రామకృష్ణ

లక్కవరపుకోట: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే ఇంగ్లిష్ పదాలు, గ్రామర్ నేర్చుకుంటే ఉన్నత చదువులు చదివేటప్పుడు అది బాగా ఉపయోగపడుతుందన్నారు. ఇంగ్లిష్ మాట్లాడడం వచ్చిన ఎంతోమందికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దామోదర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



కాలువలో పేరుకుపోయిన పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

గుర్ల: మండలంలోని సొలిపిసోమరాజుపేట గ్రామంలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. సర్పంచ్ వసంత వీరమ్మ, పంచాయతీ కార్యదర్శి కాంతిప్రియ పర్యవేక్షణలో మంగళవారం ప్రధాన రోడ్లు, కాలువల్లోని చెత్తాచెదారం తొలగించారు. ఈ నెల 21వ తేదీ నుంచి గ్రామంలో బంగారమ్మ పండగ ఉన్న నేపథ్యంలో గ్రామం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

తడిచెత్త, పొడిచెత్త వేరుచేయాలి



సూచనలిస్తున్న ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ

వేపాడ: మండలంలోని కరకవలస గ్రామంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ మంగళవారం సందర్శించారు. కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, తడిచెత్త-పొడిచెత్త వేరుచేయాలని సూచించారు. ఇక్కడ తయారయ్యే ఎరువును సబ్సిడీపై రైతులకు అందజేసి, పంచాయతీకి అదనపు నిధులు సమకూర్చాలని క్లాప్‌మిత్రలకు తెలపారు.

సంతాప సభ



అజిత్‌కుమార్‌కు నివాళులర్పిస్తున్న ఏపీజీవీబీ సిబ్బంది

వేపాడ: స్థానిక ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ అజిత్‌కుమార్(37) శ్రీకాకుళంలో ఆదివారం ఆకస్మిక మరణం చెందారు. ఈ విషాద ఘటన అందరినీ కలచివేసింది. ఈ మేరకు స్థానిక పట్టణంలో ఆయన సంతాప సభ మంగళవారం నిర్వహించి, ఆయన సేవలను సిబ్బంది కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వేసవిలో ప్రయాణాలు తగ్గించుకోవాలి

దత్తిరాజేరు: ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో దూరపు ప్రయాణాలు వీలైనంత వరకు తగ్గించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్ సూచించారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన వేసవిలో వడదెబ్బ తగిలే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించి, వడదెబ్బకు గురికాకుండా ఉండాలని తెలిపారు. అత్యవసరమైనప్పుడే బయటకు వెళ్లాలని, వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్, గొడుగు వెంట తీసుకువెళ్లాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇంట్లోనే ఉండి, ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



వృద్ధురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

గంట్యాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నరవ గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు వారి దృష్టికి తీసుకువచ్చిన పలు చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని నేతలు ఆదేశించారు. సీఎం జగన్‌తో పాటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అక్కడి వారు జేజేలు పలికారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలుకానన్ని పథకాలు ఈ రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ లబ్ధి జరిగేలా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. టీడీపీ హయాంలోని జన్మభూమి కమిటీల సభ్యులు తమకు నచ్చిన వారికే పథకాలు అందజేసేవారని, దీంతో అర్హులకే అన్యాయం జరిగేదన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని, పార్టీ పదవుల్లోనూ, రాజకీయ పదవుల్లోనూ అందరికీ అవకాశం కల్పిస్తున్నారన్నారు. ప్రజాసమస్యలన్నీ గ్రామాల్లోనే పరిష్కారమై, పథకాలన్నీ అర్హులకు మాత్రమే అందించేందుకు ఆయన తీసుకువచ్చిన గ్రామసచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు గ్రామాల్లోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా లబ్ధిదారుని వద్దకే పథకాలు వస్తున్నాయని, అభివృద్ధి పనులు తక్షణమే జరుగుతున్నాయన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, సర్పంచ్ పతివాడ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు మోపాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డెంగీని నిర్మూలిద్దాం

గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీలు చేపట్టి, దోమకాటు ఆరోగ్యానికి చేటు.. చిన్నదోమ పెద్దప్రమాదం.. పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని నినాదాలు చేశారు. తలనొప్పి, తీవ్రమైన జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు డెంగీ లక్షణాలని, వీటి బారినపడితే వెంటనే ఆస్పత్రికి వెళ్లి, చికిత్స చేయించుకోవాలన్నారు. ఏడిస్ ఈజిప్ట్ దోమ ద్వారా వ్యాప్తి చెందే ఈ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



దత్తిరాజేరు: కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది



జామి: ర్యాలీలో నినాదాలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



కొత్తవలస: ర్యాలీలో కొత్తవలస పీహెచ్‌సీ సిబ్బంది



కొత్తవలస: దోమల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న వియ్యంపేట పీహెచ్‌సీ సిబ్బంది



లక్కవరపుకోట పీహెచ్‌సీలో డెంగీ నిర్మూలనకు కృషి చేయాలని కోరుతున్న సిబ్బంది



వేపాడ: డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రాజు



శృంగవరపుకోట: ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

వేతనదారులకు ఉపశమనం



దావాలపేటలో వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం



చల్లదనం కోసం ఉపాధి హామీ పనుల ప్రదేశంలో ఏర్పాటు చేసిన చలువ పందిరి

వేసవి ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న 'ఉపాధి' వేతనదారులకు ప్రభుత్వ చర్యలు ఉపశమనం కలిగిస్తున్నాయి. భానుడి ప్రతాపానికి రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా పని ప్రదేశంలో నీడ ఉండేలా టెంట్లు, దాహార్తి తీర్చేలా తాగునీరు, తక్షణ శక్తి కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఈ చర్యలతో వేతనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – గజపతినగరం



ఎన్.జి.ఆర్ పురంలో టార్పాలిన్‌లో సేదతీరుతున్న వేతనదారులు

మద్యంసీసాల స్వాధీనం

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 30 మద్యం సీసాలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఈ తనిఖీలు చేశామని, ఈ ఘటనకు సంబంధించి, కోడూరు గ్రామ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శిరీష తెలిపారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ సమీపంలోనున్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 18 వరకు గడువు ఉందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేబీబీ రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 – 23 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీలో 60, బైపీసీ, సీఈసీలో 40 సీట్లు చొప్పున మొత్తం 140 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా

జాగ్రత్తలు తీసుకోవాలి



చీపురుపల్లి: వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల సహాయ కార్మిక శాఖాధికారి బి.కొండలరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ప్రస్తుతం వడగాడ్పులు వీస్తున్న నేపథ్యంలో ముఖ్యంగా పని ప్రదేశంలోని కార్మికులు జాగ్రత్త వహించాలన్నారు. ఈ మేరకు జాగ్రత్త చర్యలు సూచిస్తూ ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ కమిషనర్ నుంచి వచ్చిన ఆదేశాలను పరిశ్రమలు, నిర్మాణ సంస్థలు, దుకాణాల యాజమాన్యాలతో పాటు వర్తక, వాణిజ్య సంస్థలకు పంపించడం జరిగిందన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నాయని, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్ర 4 గంటల వరకు ఉండే వేడి వాతావరణంలో పనులు నిర్వహించరాదన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్ఎస్, ఐవీఫ్లూయిడ్స్‌తో పాటు ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అకాల వర్షం

- ఈదురుగాలులకు నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- మరికొన్నిచోట్ల స్వల్ప పంట నష్టం



గజపతినగరంలో కురుస్తున్న వడగండ్ల వాన



బొండపల్లి: రోడ్డుపై విరిగిపడిన చెట్టు



గుర్లం: ఆటోపై కూలిన చెట్టు



బొండపల్లి: గొల్లుపాలెంలో ఓ ఇంటిపై కూలిన విద్యుత్ టవర్



జామి: వెన్నె గ్రామంలో నేలమట్టమైన అరటి పంట

బొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం మంగళవారం కురిసింది. గాలుల ధాటికి అక్కడక్కడ చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

జామి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. వర్షానికి ముందు వీచిన ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. మరికొన్నిచోట్ల సాగులో ఉన్న పలు పంటలకు నష్టం వాటిల్లింది.

గజపతినగరంలో వడగండ్ల వాన

గజపతినగరం: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. మబ్బులతో కూడిన వాతావరణం ఏర్పడి, అనంతరం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఇన్నాళ్లు వేసవి ఎండల కారణంగా ఉక్కపోతతో అలమటించిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం ఇచ్చింది. పురిటిపెంట గ్రామంలో వీచిన ఈదురుగాలులకు కొన్ని వృక్షాలు నేలకొరిగాయి.

గుర్ల: మండలంలోని గూడేం గ్రామంలో మంగళవారం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల ధాటికి ప్రధాన రోడ్డులోని ఓ చెట్టు అటువైపుగా వస్తున్న ఆటోపై కూలింది. వేసవి ఎండల నేపథ్యంలో ఉక్కపోతతో అలమటించిన జనానికి ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించినట్లయింది.

జామి: మండలంలోని పలుచోట్ల మంగళవారం మధ్యాహ్నం కురిసిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులకు గొడికొమ్ము, జామి ప్రాంతాల్లోని భారీ వృక్షాలు, అన్నంరాజుపేట గ్రామంలోని విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల కోత దశకు చేరుకున్న మామిడిపంట నేలరాలింది. దీంతో జీడిమామిడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎండల కారణంగా కొన్నిరోజులుగా ఉక్కపోతతో అలమటించిన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనమిచ్చింది.

ఘనంగా గ్రామదేవత పండగ



జువ్వాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

వేపాడ: మండలంలోని బొద్దాంలో పైడితల్లమ్మ, శింగరాయిలో జువ్వాలమ్మ గ్రామదేవతల పండగలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు తొలుత అమ్మవార్లకు ఘటాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన వీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.



బొద్దాంలో పైడితల్లి అమ్మవారి ఘటాల ఊరేగింపు

ప్రభుత్వ పాఠశాలలోని సదుపాయాలపై కరపత్రాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్యాబోధన, మౌలిక సదుపాయాలపై రూపొందించిన కరపత్రాలను సిబ్బంది మంగళవారం ఆవిష్కరించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు లిఖిత, మరియ వరుసగా 569, 565 మార్కులు సాధించారని, అలాగే మనబడి నాడు-నేడు పథకం నిధులతో పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. త్వరలోనే గ్రామాల్లో పర్యటించి, బడిఈడు పిల్లలంతా బడిలో చేరేలా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీం షేక్‌లాల్, బి.కిరణ్ కుమార్, బి.శ్రీదేవి, ఎల్.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సదస్సును జయప్రదం చేయండి

శృంగవరపుకోట: అఖిల భారత ఆదివాసీ సదస్సుకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని స్థానిక ఆదివాసీ, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ సర్కారు ఆదివాసీల హక్కులను కాలరాసేలా పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. బీజేపీ హయాంలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భారీ సంఖ్యలో సదస్సుకు తరలివచ్చి, ఆదివాసీల ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ, ప్రజాసంఘాల నేతలు యు.మల్లేష్ పార్వతి, కె.దేముడమ్మ, ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆదివాసీ, ప్రజాసంఘాల నేతలు